విలేఖరులు కావలెను
తెలుగు రాష్ట్రాలలో లక్షలాది మంది పాఠకుల అభిమానాన్ని చూరగొంటున్న 'సూర్య ప్రభా' ఈ-పేపర్‌లో పని చేయుటకు జిల్లా, నియోజకవర్గాలు, మండలాల వారీగా విలేఖరులు కావలెను. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించగలరు.
ఫోన్ - 8985829417

సూర్య ప్రభా
తెలుగు జాతీయ దిన పత్రిక
సంపుటి : 2 సంచిక: 2 | ఎడిటర్ : ఇ.సంజీవరెడ్డి | శుక్రవారం, జూన్ 27 2025 | పేజీలు : 4

# రాజ్యాంగమే అత్యున్నతమైనది.. పార్లమెంట్ కాదు

## సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ సంచలన వ్యాఖ్యలు



చాలా మంది పార్లమెంట్ అత్యున్నతమైనదని అంటారు కానీ.. తన దృష్టిలో భారత రాజ్యాంగ మే పరమోన్నతమైనదని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ అన్నారు. ఇవాళ ఆయన మహారాష్ట్రలోని అమరావతిలో తన సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతూ..సుప్రీం కోర్టు 'మౌలిక నిర్మాణ సిద్ధాంతం' ఆధారంగా ఇచ్చిన తీర్పును ఉటంకిస్తూ, పార్లమెంటుకు రాజ్యాంగాన్ని సవరించే అధికారం ఉన్నప్పటికీ, దాని మౌలిక నిర్మాణాన్ని మార్చలేరని అన్నారు. ప్రతి ఒక్కరికీ నివసించేందుకు ఇల్లు ఉండాలి.. బుల్డోజర్ న్యాయంపై తాను ఇచ్చిన తీర్పు సరైనదేనని సమర్థించుకున్నారు. తాము విధులు నిర్వర్తి స్తున్నామని విషయాన్ని న్యాయమూర్తులు ఎల్లప్పుడు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. ప్రజల హక్కులు, రాజ్యాంగ విలువలు, నిబంధనలకు రక్షకులం ప్రజాస్వామ్యంలోని మిగిలిన మూడు విభాగాలు భారత రాజ్యాంగానికి లోబడే పనిచేస్తాయని అన్నారు. తీర్పుల విషయంలో ప్రజలు ఏమనుకుంటున్నారన్నది న్యాయమూర్తులను ప్రభావితం చేయకూడదని.. స్వతంత్రంగా ఆలోచించాలని పేర్కొన్నారు. వాస్తవానికి తాను ఆర్కిటెక్ట్ కావాలనుకున్నప్పటికీ, తండ్రి తనను న్యాయవాదిగా చూడాలని కోరుకున్నారని బీఆర్ గవాయి తెలిపారు.




## రేవంత్ సర్కార్ మరో శుభవార్త.. ఆ శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీ

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. ఆరోగ్యశాఖలో మరోసారి భారీగా ఉద్యోగాల భర్తీ చేస్తున్నట్లు రేవంత్ ప్రభుత్వం ప్రకటించింది. ఒకేరోజు మూడు వేర్వేరు జాబ్ నోటిఫికేషన్లు ఇవ్వడానికి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది. ప్రభుత్వ ప్రకటనతో అసిస్టెంట్ ప్రొఫెసర్, డెంటల్ అసిస్టెంట్ సర్జన్స్, స్పీచ్ ఫాథాలజిస్ట్ పోస్టులకు నోటిఫికేషన్లు వెలువడనున్నాయి. ప్రభుత్వ హాస్పిటల్స్‌లో గడిచిన 17 నెలల్లో 8 వేలకుపైగా పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేసింది.

మరో 3212 నర్సింగ్ ఆఫీసర్లు, 732 ఫార్మసిస్ట్, 1284 ల్యాబ్ టెక్నీషియన్, 1950 మల్టీ పర్పస్ ఫీమెల్ హెల్త్ అసిస్టెంట్ పోస్టులకు భర్తీ ప్రక్రియ కొనసాగుతోంది. ఇప్పటికే ఆయా పోస్టుల ఫలితాలను విడుదల చేయడంతో మెరిట్ జాబితాలు సిద్ధమవుతున్నాయి. విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో మెడికల్ కాలేజీల్లోని పోస్టుల భర్తీకి మెడికల్ రిక్రూట్‌మెంట్ బోర్డు సిద్ధమైంది.

# ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమాకరం

## డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి: సీఎం రేవంత్‌రెడ్డి





హైదరాబాద్: ఐటీ, ఫార్మా హబ్‌గా ఉన్న తెలంగాణ.. గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మారితే మనందరం విఫలమైనట్టేనని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మాదాపూర్‌లోని శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన సదస్సులో సీఎం ప్రసంగించారు. తెలంగాణ గడ్డపై గంజాయి, డ్రగ్స్ వైపు చూస్తే వారి వెన్ను విరుస్తామని ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన మరుక్షణమే స్పష్టంగా చెప్పానని ఈ సందర్భంగా గుర్తు చేశారు. "తెలంగాణ అంటే ఉద్యమాలు.. పోరాటాల గడ్డ. ఉద్యమాల గడ్డ డ్రగ్స్‌కు అడ్డాగా మారితే అవమానకరం. పాఠశాలల నుంచి యూనివర్సిటీల వరకు విద్యార్థులపై డ్రగ్స్ ప్రభావం పడింది. డ్రగ్స్ మహమ్మారికి బలవుతున్నారు.


యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలైతే దేశం మనుగడకే ప్రమాదం. ఒక దేశాన్ని దెబ్బతీయడానికి శత్రుదేశాలు ఏ మార్గాన్ని ఎంచుకుంటాయో చెప్పలేం. కొన్ని దేశాలు కొవిడ్‌ను ఎంచుకోవచ్చు.. మరికొన్ని దేశాలు డ్రగ్స్‌ను ఎంచుకోవచ్చు. మదక ద్రవ్యాలు తరలించే వారు తెలంగాణ సరహద్దులో అడుగు పెట్టాలంటే ఒకటికి వంద సార్లు ఆలోచించుకునేలా చర్యలు ఉండాలని మంత్రివర్గ సహచరులు, పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలిచ్చా. యుద్ధం, సైనికులు అంటేనే.. పంజాబ్ గుర్తుకు వచ్చేది. అలాంటి పంజాబ్ ఇవాళ డ్రగ్స్ మహమ్మారి వలలో చిక్కుకుంది. డ్రగ్స్ నివారణలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలవాలి యువతను సరైన మార్గంలో పెట్టాలి, అభివృద్ధి పథంవైపు నడిపించాలని స్పోర్ట్స్ పాలసీ తీసుకొచ్చాం. 140 కోట్ల జనాభా ఉన్న దేశానికి ఒలింపిక్స్‌లో ఒక్క స్వర్ణపతకం రాకపోవటం గురించి ఆలోచించాం. యువతకు సాంకేతిక నైపుణ్యం అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం.

డ్రగ్స్ నిర్మూలన బాధ్యత పౌరులపై కూడా ఉంది. పిల్లల ప్రవర్తనను గమనించేందుకు ప్రత్యేకమైన సిబ్బందిని నియమించుకోవాలి. సబ్జెక్ట్, పీఈటీలను నియమించుకున్నట్టే బిహేవియర్ అబ్జర్వర్స్‌ను నియమించుకోవాలి. చాక్లెట్లు, ఐస్‌క్రీమ్‌లలో గంజాయి, డ్రగ్స్ కలిపి విక్రయిస్తున్నారు. గంజాయి అమ్మే వారి గురించి పోలీసులకు సమాచారం ఇవ్వాలి. విద్యాసంస్థల్లో డ్రగ్స్ కనిపిస్తే యాజమాన్యాలదే బాధ్యత. డ్రగ్స్ నివారణకు ప్రత్యేకంగా 'ఈగల్' అనే విభాగాన్ని ఏర్పాటు చేస్తున్నాం. గంజాయి పంట, సరఫరా, విక్రయంపై ఈగల్ టీమ్ ప్రత్యేక నిఘా పెడుతుంది" అని సీఎం తెలిపారు. సినీనటులు రామ్‌చరణ్, విజయ్‌దేవరకొండకు ఎంత బిజీ షెడ్యూల్ ఉన్నా.. యువతకు మంచి సందేశం ఇవ్వాలని, ఈ రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలవాలని ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు" అని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత దిల్‌రాజు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, కోచ్ పుల్లెల గోపీచంద్, పలువురు ఉన్నతాధికారులు...తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తాం!




## గంజాయి బ్యాచ్‌కు సహకరిస్తే.. గుణపాఠం తప్పదు: చంద్రబాబు



గుంటూరు: రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడితే ఊరుకోమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయడు హెచ్చరించారు. రాజకీయం ముసుగులో రౌడీయిజం చేస్తే తోక కట్ చేస్తానని వార్నింగ్ ఇచ్చారు. ఇవాళ(గురువారం) గుంటూరులో యాంటీ నార్కొటిక్స్ డేలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ర్యాలీని ముఖ్యమంత్రి ప్రారంభించారు. గంజాయి సాగుతో దేశాన్ని, ఏపీని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ఏపీ బ్రాండ్‌ను గత పాలకులు నాశనం చేశారని ఆరోపించారు. డ్రగ్స్, గంజాయిపై యుద్ధాన్ని ప్రకటిస్తున్నానని ఉద్ఘాటించారు సీఎం చంద్రబాబు. అడ్డొస్తే తొక్కుకుంటూ వెళ్తాం.. వదిలిపెట్టమని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గంజాయి ఎవరూ వాడినా వదిలిపెట్టమని.. లా అండ్ ఆర్డర్‌లో చాలా సమస్యలు చూశానని తెలిపారు. రాయలసీమలో ముఠాలను అణచివేసిన పార్టీ టీడీపీ అని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో ముఠా కక్షలు ఉండటానికి వీల్లేదని అన్నారు. మారితే మారండి.. మారకపోతే ఏపీలో ఉండే అర్హత లేదని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గంజాయి నిర్మూలన బాధ్యత కేవలం ప్రభుత్వానిదే కాదు.. ప్రతిపక్షాలు కూడా ముందుకువచ్చి ప్రజల్లో చైతన్యం తేవాలని సీఎం చంద్రబాబు కోరారు. చైతన్యం తెచ్చి ఓట్లు కోరాలి తప్ప రాజకీయ లబ్ధి పొందుతామంటే కుదరదని తేల్చిచెప్పారు. ఈగల్ పేరుతో గంజాయిపై రాష్ట్రవ్యాప్తంగా డేగకన్ను వేశామని చెప్పుకొచ్చారు. 26 జిల్లాల్లో నార్కొటిక్ సెల్స్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈగల్ సెల్స్, టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు, స్కూళ్లలో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశామని వివరించారు సీఎం చంద్రబాబు. మద్యం ఆదాయంలో రెండు శాతాన్ని గంజాయి నిర్మూలనకు ఖర్చు చేస్తున్నామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. గంజాయి, డ్రగ్స్ అమ్మేవారి ఆస్తులు కూడా జప్తు చేస్తామని హెచ్చరించారు. డ్రగ్స్, గంజాయిపై పోరాడితే టీడీపీ ఆఫీసుపై దాడి చేశారని గుర్తుచేశారు. డ్రగ్స్ నిర్మూలన కోసం సినీ సెలబ్రిటీలు ముందుకురావాలని కోరారు. గంజాయి వేరే ప్రాంతాలనుంచి తీసుకువచ్చి ఏపీలో అమ్మినా వదిలేది లేదని సీఎం చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. " గంజాయికి బానిసలవ్వడం వల్ల కుటుంబ సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. గంజాయి వినియోగం వల్ల అసాంఘిక చర్యలకు పాల్పడుతూ జీవితం నాశనం చేసుకుంటున్నారు. మెడికల్ షాపుల్లోనూ మత్తుపదార్థాలు అమ్ముతున్నారు. 'ఈగల్' పేరుతో గంజాయిపై రాష్ట్ర వ్యాప్తంగా డేగ కన్ను ఉంటుంది. ఇప్పటికైనా మారకపోతే రాష్ట్రంలో ఉండేందుకు అర్హత లేదు. ఎవరైనా ఆడబిడ్డల జోలికి వస్తే.. అదే వారికి చివరి రోజు అవుతుంది. 26 జిల్లాల్లో నార్కోటిక్స్ సెల్స్ ఏర్పాటు చేశాం. పాఠశాలల్లో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేశాం. 1972కు మెసేజ్ పంపితే కాపాడే బాధ్యత తీసుకుంటాం. మద్యం ఆదాయంలో 2శాతం డ్రగ్స్ నిర్మూలనకు ఖర్చు చేస్తాం. రాష్ట్రంలోని 3 ప్రాంతాల్లో 56 డీఅడిక్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. డ్రగ్స్ వ్యతిరేక ప్రచారానికి సినీనటులు కూడా ముందుకురావాలి. ప్రజా చైతన్యం కోసం కృషి చేయాలి" అని చంద్రబాబు పిలుపునిచ్చారు. కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, హోం మంత్రి అనిత, పలువురు ప్రజాప్రతినిధులు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# తప్పులు సరిదిద్ది.. హద్దులు సవరించి

హైదరాబాద్ : నగరంలో పోలింగ్ కేంద్రాల హద్దులను చక్కదిద్దేందుకు జీహెచ్ఎంసీ రంగంలోకి దిగింది. ఎన్నికల విభాగం డివిజన్ల వారీగా డిజిటల్ సర్వే చేపట్టింది. ఒక ఇంటి ఓటర్లు వేర్వేరు పోలింగ్ కేంద్రాల్లో ఓటు వేయాల్సిన పరిస్థితులు, నివాసం ఓ చోట.. పోలింగ్ కేంద్రం మరోచోట ఉన్న కాలనీలను గుర్తించి పోలింగ్ కేంద్రాల హద్దులతో డిజిటల్ పటాలను రూపొందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. త్వరలోనే ప్రక్రియ పూర్తవనుందని అధికారులు చెబుతున్నారు.

**జనగణన నేపథ్యంలో..:** హైదరాబాద్ జిల్లాలో 46 లక్షల మంది ఓటర్లుండగా.. అసెంబ్లీ నియోజకవర్గాలు 15, జీహెచ్ఎంసీ డివిజన్లు 84 ఉన్నాయి. ఆయా స్థానాలకు సుమారు నాలుగు వేల పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగుతుంటాయి. ఇటీవల కేంద్రం జనాభా లెక్కల సర్వేను త్వరలో ప్రారంభిస్తున్నట్లు ప్రకటించడంతో.. జిల్లాకు సంబంధించిన ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల హద్దులు సరిగా లేవంటూ భాజపా, ఎంఐఎం పార్టీలు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశాయి. జనగణన పూర్తయితే నియోజకవర్గాలు పెరుగుతాయని, డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాల



హద్దులను చక్కదిద్దాలని డిమాండ్ చేశాయి. నగరీ నక్షాలో(నగర పటం) ఉన్న తప్పులను సవరించాలని కోరడంతో.. జీహెచ్ఎంసీ ఎన్నికల విభాగం ఇటీవల సర్కిళ్ల వారీగా సమావేశాలు ఏర్పాటు చేసింది. డివిజన్ల ఓటరు జాబితాను పరిశీలించాలని, ఇంటి నంబర్లు, చిరునామా ఆధారంగా ఓటర్లను సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో చేర్చాలని సూచించారు. వివరాలు సరిగా లేకపోతే జాబితా రూపొందించుకొని ఇంటింటి తనిఖీ చేయాలన్నారు. నకిలీ ఓటరు అయితే కార్డును రద్దు చేయడం, ఓటరు ఆ ఇంట్లో నివాసం ఉంటున్నట్లయితే సంబంధిత పోలింగ్ కేంద్రానికి మార్చాలని కేంద్ర కార్యాలయం సిబ్బందికి మార్గదర్శనం చేసింది. డివిజన్ల వారీగా పోలింగ్ కేంద్రాల డిజిటల్ పటాలను పక్కాగా రూపొందిస్తే.. జనాభా లెక్కలు పూర్తయ్యాక జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను సులువుగా చేపట్టవచ్చని సూచించారు.

## కాలుష్య కాసారంలా హుస్సేన్‌సాగర్

హైదరాబాద్: హుస్సేన్‌సాగర్‌లో కాలుష్య ఉద్గారాల స్థాయి నానాటికీ పెరుగుతోంది. నిత్యం సుమారు 450 ఎంఎల్‌డీలకు పైగా వ్యర్థజలాలు నేరుగా కలుస్తుండటంతో నీటిలో కరిగిన ఆక్సిజన్ పరిమాణం తగ్గుతోంది. డిజాల్వ్‌డ్ ఆక్సిజన్ (డీవో) పరిమాణం 4 మిల్లీగ్రాముల కంటే ఎక్కువగా ఉండాలని, బీవోడీ (బయోలాజికల్ ఆక్సీజన్ డిమాండ్) 3 మిల్లీగ్రాములకు మించరాదంటూ కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి సూచిస్తుండగా అనేక చోట్ల పరిమితులకు మించి నమోదవుతోంది. తాజాగా జలాశయాల్లో నీటి నాణ్యత నివేదికను కాలుష్య నియంత్రణ మండలి విడుదల చేసింది. లీటర్ నీటిలో డీవో 0.3 మిల్లీగ్రాములు, బీవోడి 10 మిల్లీగ్రాములుగా ఉందని నివేదిక స్పష్టం చేసింది. జీహెచ్ఎంసీ కార్యాలయం అవుట్‌లెట్, మారియట్ హోటల్



అవుట్‌లెట్, ఖైరతాబాద్ ఎస్టీపీ జాయినింగ్ అవుట్‌లెట్, సంజీవయ్య పార్కు, బుద్ధ విగ్రహం, నెక్లెస్‌రోడ్, ఎన్టీఆర్ గార్డెన్, లేపాక్షి హ్యాండిక్రాఫ్ట్స్, హుస్సేన్‌సాగర్ సెయిలింగ్ క్లబ్ వద్ద పీసీబీ శాంపిళ్లను సేకరిస్తోంది. ల్యాబ్‌కు పంపిన అనంతరం ఫలితాలను వెల్లడిస్తోంది. నదుల్లో లీటరు నీటిలో బీవోడీ 0 నుంచి 5 ఎంజీ ఉండాలి. కాలుష్యమయమైన జలాశయాల్లో 5 నుంచి 60 ఎంజీ వరకు ఉంటుందని సీపీసీబీ పేర్కొంది. శాంపిళ్లు సేకరించినప్పుడల్లా ఖైరతాబాద్ ఎస్టీపీ వద్ద 86, సంజీవయ్య పార్కు వద్ద సగటున 92గా నమోదవుతోంది. సీవోడీ 60 నుంచి 120 ఎంజీ వరకు ఉండాలి. ఏడు ప్రాంతాల్లో పరిమితికి మించి నమోదవుతోంది.

## ముక్కుపుటాలదురుతున్నాయ్

హైదరాబాద్: మెట్రోరైలు స్టేషన్ల పరిసరాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం దుర్గంధం రాని, నీరు అవసరం లేని మూత్రశాలలు ఏర్పాటు చేశారు. ప్రైవేటు సంస్థతో కలిసి హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ పలుచోట్ల వీటిని అందుబాటులోకి తీసుకొచ్చింది. నిర్వహణ కొరవడి పరిసరాలు అపరిశుభ్రంగా మారటంతో కొన్నిచోట్ల మూత్రశాలలను వాడలేని పరిస్థితి ఏర్పడింది.

**ఏడేళ్ల క్రితం ప్రయత్నం..**నీరు లేక ప్రజా మరుగుదొడ్లు దుర్గంధభరితంగా మారుతుండటం తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఈ పరిస్థితిని మార్చేందుకు హైదరాబాద్ మెట్రోరైలు సంస్థ ఏడేళ్ల క్రితం వినూత్న ప్రయత్నం చేసింది. ఒక అంకుర సంస్థతో కలిసి నీటితో పనిలేకుండా, దుర్వాసన రాకుండా పర్యావరణహితమైన మూత్రశాలలు ప్రారంభించింది. మియాపూర్, కూకట్‌పల్లి, జేఎన్‌టీయూ, అమీర్‌పేట, రసూల్‌పురా వంటి స్టేషన్ల పాదబాటల్లో ఏర్పాటు చేసింది. తర్వాత ఇతర స్టేషన్ల పరిసరాల్లోనూ అందుబాటులోకి తీసుకొచ్చారు. ఏకకాలంలో ముగ్గురు వినియోగించుకునేలా వీటిని డిజైన్ చేశారు.

**నీటిని వేరు చేసి..** మూత్రశాలల ప్రధాన సమస్య దుర్వాసన.. దీనికి కారణమయ్యే అమ్మోనియా, యూరియాను బయోఫిల్టరైజేషన్ ప్రక్రియ ద్వారా విచ్ఛిన్నం చేసేలా వీటిని రూపొందించారు. మూత్రం నుంచి వేరుచేసిన నీటిని ప్రత్యేకమైన ట్యాంకులోకి సేకరించి అక్కడే ఉన్న మొక్కలకు వాడటం లేదా భూమిలోకి ఇంకించేవారు. మూత్రాన్ని వాయురహిత డైజెస్టరులోకి సేకరించి., అక్కడ సూక్ష్మజీవులు మూత్రాన్ని క్షీణింపచేసేలా సాంకేతికతను వినియోగించారు.

# భద్రత.. భరోసా.. భవిత



హైదరాబాద్ : పద్నాలుగేళ్ల ప్రాయంలోనే ఒత్తిడి తట్టుకోలేక ఆత్మహత్యలు, చిన్నతనంలోనే ఫోన్ల వినియోగం.. లైంగిక వేధింపులు.. పెరుగుతున్న సైబర్ నేరాలు, మరోవైపు డ్రగ్స్.. ఇలా పాఠశాల విద్యార్థులు అనేక రుగ్మతలు, ముప్పును ఎదుర్కొంటున్నారు. వీటి నుంచి బయటపడేసి.. విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయడానికి సైబరాబాద్ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు. పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న సేఫ్టీ క్లబ్‌లను గాడిన పెట్టాలని భావిస్తున్నారు. ప్రధానంగా లైంగిక వేధింపులు, మానసిక ఒత్తిడి, రహదారి భద్రత, డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలు దరి చేరకుండా చర్యలు చేపట్టనున్నారు. ఇప్పటికే తరగతులు ప్రారంభమైన దృష్ట్యా పాఠశాలల వారీగా కొత్తగా క్లబ్‌లు ఏర్పాటయ్యేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. విద్యార్థులు, బడి యాజమాన్యం, తల్లిదండ్రులు, పోలీసులు, తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో ఇలా అన్ని విభాగాల సమన్వయంతో ఈ క్లబ్‌లు చురుకైన పాత్ర పోషించేలా చర్యలు తీసుకోనున్నారు.

**ఏం చేస్తాయంటే..?:** ప్రధానంగా ఈ కింది నాలుగు అంశాలపై క్లబ్‌ల ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తారు.

లైంగిక వేధింపులు ఎదురైతే ఏం చేయాలి.. ఇతర అంశాలపై అవగాహన కల్పిస్తారు. గుడ్‌టచ్, బ్యాడ్ టచ్ అంటే ఏమిటో చెబుతున్నారు. మత్తు పదార్థాలతో జరిగే అనర్థాలు, ఒకవేళ తోటి విద్యార్థులు డ్రగ్స్, మత్తు పదార్థాలకు అలవాటుపడితే ఎవరికి చెప్పాలో నేర్పిస్తారు.

ఆన్‌లైన్‌లో అపరిచితులు, లైంగిక వేధింపుల బారినపడకుండా జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.

డిజిటల్ ముప్పు, వ్యక్తిగత గోప్యత పాటించడంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అంతర్జాలం వినియోగించేప్పుడు బాధ్యతగా ఉండాల్సిన తీరును వివరిస్తారు.

సమస్యలు ఎదురైనప్పుడు మానసిక ఒత్తిడికిలోనవకుండా.. ధైర్యంగా ముందుకొచ్చి ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పిస్తారు. పరిష్కార వేదికల్ని ఏర్పాటు చేస్తారు.

తోటి విద్యార్థులు, నిత్య జీవితంలో పరిచయమయ్యే వ్యక్తులతో వ్యవహరించాల్సిన తీరును వివరిస్తారు.

రహదారులపై వెళ్లినప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ బాధ్యతగా వ్యవహరించడంపై శిక్షణ ఇస్తారు.

పాఠశాల ఆవరణలో ప్రమాదకరమైన వస్తువులు, ఇతరత్రా ఏది కనిపించినా రిపోర్టు చేసేలా ప్రోత్సహిస్తారు.

**స్వరూపం ఇలా..**

సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ప్రతి పాఠశాలలో సేఫ్టీ క్లబ్‌లు ఏర్పాటు చేస్తారు.

అన్ని తరగతుల్లోని గ్రేడ్ల నుంచి ఇద్దరు విద్యార్థులు సేఫ్టీ మార్షల్స్‌గా, తల్లిదండ్రుల సంఘం, పోలీసుల నుంచి ఒకరు చొప్పున సభ్యులుగా ఉంటారు.

ప్రధానోపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయుడు ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తారు.

సభ్యులకు సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ శిక్షణ ఇస్తుంది. ఏం చేయాలో మార్గనిర్దేశనం చేస్తారు.

సమస్యలు చెప్పడానికి సుశిక్షితులైన బాలమిత్ర ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారు.

విద్యార్థులకు అండగా : వినీత్, మాదాపూర్ డీసీపీ

"మారుతున్న పరిస్థితుల నేపథ్యంలో విద్యార్థులపై అనేక అంశాలు ప్రభావం చూపుతున్నాయి. వ్యసనాల బారిన పడుతున్నారు. వీటి ఉచ్చులో పడకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. సేఫ్టీ క్లబ్‌లు విద్యార్థులకు అండగా ఉంటాయి."

# నిధులకు పాతర.. వసూళ్ల జాతర



హైదరాబాద్ : ఏటా జరిగే ఉత్సవాలను కొందరు పోలీసులు తమకు అనువుగా మలుచుకుంటున్నారు. అదనపు సిబ్బందికి అవసరమైన భోజన, వసతి కోసం నిధులు మంజూరు చేస్తున్నా.. కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు తీరు మార్చుకోమని పలుమార్లు హెచ్చరించినా పాతపద్ధతినే అనుసరిస్తున్నారు. భిన్న మతాలు, కులాలున్న మహానగరిలో ఏ కార్యక్రమం నిర్వహించినా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తుంది. ఉన్నతాధికారులు రంగంలోకి దిగి స్వయంగా పర్యవేక్షిస్తుంటారు. ఇటువంటి చోట ఉత్సవాలు, ఊరేగింపు, బందోబస్తు పేరిట కొందరు అధికారుల అక్రమాల పర్వం.. వ్యవస్థకే చెడ్డపేరు తీసుకొస్తుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

**హద్దుమీరితే వేటు ఖాయం**

మహానగరం బోనాలకు ముస్తాబవుతోంది. ఇంతటి ప్రతిష్ఠాత్మక సంబరాలను సొమ్ము చేసుకునేందుకు కొందరు పోలీసులు సిద్ధమైనట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన ఆలయాలున్న చోట కొందరు అడ్మిన్ ఎస్సైలు దుకాణదారులు, హొటళ్లు, బార్ అండ్ రెస్టారెంట్ల నిర్వాహకుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లకు పాల్పడుతున్నట్టు ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందినట్టు సమాచారం. ఉన్నతాధికారులు బదిలీ ఉత్తర్వులు జారీచేసి రోజులు గడుస్తున్నా కొందరు ఎస్సైలు అవే ఠాణాల్లో ఉన్నట్టు తెలుస్తోంది. కేసుల దర్యాప్తు, ఠాణా నిర్వహణ కోసం ఎస్‌హెచ్‌వో ఒత్తిడితో ఉన్నట్టు ప్రచారం సాగుతోంది. నగరంలో ప్రధాన ఆలయం.. లక్షలాది మంది భక్తులు వస్తుంటారు. ఆ ఆలయ పరిధిలోని ఠాణాకు చెందిన అడ్మిన్ ఎస్సై రూ.5 లక్షల వరకు వసూలు చేసినట్టు తెలుస్తోంది. ఉత్సవాలు పూర్తయ్యే వరకు తానే ఉంటానంటూ వ్యాపారులను బెదిరించి ఎంత చెల్లించాలనేది ముందుగానే చెప్పినట్లు సమాచారం. ఇదే తరహాలో మరో ఠాణాకు చెందిన ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు 4 రోజులుగా వ్యాపారుల చుట్టూ తిరుగుతున్నట్లు డీసీపీ దృష్టికి వెళ్లిందని తెలుస్తోంది. వసూళ్ల వ్యవహారం ఉన్నతాధికారులకు తెలియడంతో కొందర్ని హెచ్చరించినట్లు సమాచారం.

**ఎందుకిలా..?**

పండుగలు.. ఉత్సవాలు.. ఊరేగింపులు.. ఏదైనా బందోబస్తు.. శాంతిభద్రతల నిర్వహణకు అదనపు బలగాలు తప్పనిసరి. వీరికి భోజన, వసతి కల్పించాలి. గతేడాది నగరంలో 26 కార్యక్రమాలకు పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వం నిర్వహణ ఖర్చులకు నిధులు మంజూరు చేస్తున్నా.. కొందరు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు పోలీసు ఉన్నతాధికారి తెలిపారు.

# దడ పుట్టిస్తున్న డెంగీ



హైదరాబాద్ : నగరంలో డెంగీ జ్వరాలు పడగ విప్పాయి. దోమకాటుతో.. బస్తీలు, కాలనీల్లో జ్వరం బాధితులు పెరుగుతున్నారు. చికిత్స కోసం ఆస్పత్రులకు వెళ్లినా దోమల సమస్య తప్పడం లేదు. కాలనీలతోపాటు దవాఖానాల్లోనూ దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. ముఖ్యంగా.. నిరుపేదలు నివసించే బస్తీల్లో దోమలను మొదటి ప్రాధాన్యం కింద నియంత్రించాల్సి ఉంది. బస్తీల్లో నమోదయ్యే జ్వరాల గురించి గతేడాది కూడా జీహెచ్ఎంసీ దృష్టిపెట్టలేదు. మూసాపేటలో ఓ చిన్నారి డెంగీ జ్వరం వల్ల చనిపోయినట్టు పత్రికల్లో వచ్చాక కూడా.. బాధితురాలి ఇంటిలో, ఆ బస్తీలో బల్దియా నివారణ చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

**సమాచారం ఇవ్వకుండా**

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు కలిపి 700 దవాఖానాలు ఉన్నాయి. కాలనీల్లో అనధికారికంగా, గుర్తింపు పొందిన వైద్యులతో నడిచే క్లినిక్‌లు కూడా దాదాపు అంతే సంఖ్యలో ఉంటాయి. వాటిలో వైద్య పరీక్షలు కూడా జరుగుతుంటాయి. అవి కాకుండా.. రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రాలు మరో వెయ్యి వరకు ఉంటాయని అంచనా. వాటిలో చేపట్టే డెంగీ ఎలీసా ఐజీజీ ఐజీఎం పరీక్షల్లో.. డెంగీ జ్వరం ఉన్నట్టు తేలితే.. వివరాలు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా జీహెచ్ఎంసీకి అందాలి. 24గంటల్లో.. ఎంటమాలజీ సిబ్బంది బాధితుల ఇంటికి వెళ్లి.. దోమలను అంతం చేసే రసాయనాలను పిచికారీ చేయాలి. బాధితుల సమాచారం ఎక్కడికక్కడ నిలుస్తుండటంతో.. త్వరగా చేపట్టాల్సిన నివారణ చర్యల్లో జాప్యం జరుగుతోంది.

**ఒకే రోజు..**

గత 3 రోజుల్లో హైదరాబాద్ జిల్లాలో 27 డెంగీ కేసులు నమోదయ్యాయి. ఈ సంఖ్య ఇంకా ఎక్కువే ఉంటుంది. వైద్య ఆరోగ్యశాఖ, ఎంటమాలజీ అధికారులు ఉమ్మడి కార్యాచరణ రూపొందించుకుని.. ప్రజలను జ్వరాల నుంచి బయటపడేయాల్సిన ఆవశ్యకత కనిపిస్తోంది.

**గుర్రపుడెక్క తీయట్లేదు..**

చెరువులు, నాలాల చుట్టుపక్కలున్న కాలనీల్లో దోమల సమస్య విపరీతంగా ఉంది. మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఏడాదంతా ఉంటుంది. చెరువులు, మూసీలోని గుర్రపుడెక్కతోనే ఈ సమస్య. రెండు, మూడు నెలలకోసారి పొక్లెయిన్‌లతో గుర్రపుడెక్కను తొలగించి అధికారులు చేతులు దులిపేసుకుంటున్నారు. గతంలో మాదిరి ఇంటింటి తనిఖీలు, ఇళ్లలోని నీటి నిల్వలను తొలగించడం, ప్రజలు, విద్యార్థులకు దోమల నివారణ అవగాహన కల్పించాలి. మూడేళ్లుగా చెరువుల్లో గంబూసియా చేపలను వదిలే కార్యక్రమం జరగట్లేదు. వాటిని వదిలితే.. చెరువుల్లోని దోమల లార్వాను తింటాయి.

# చిన్న కమతాలే అధికం

జగిత్యాల : జిల్లాలో భూకమతాలు, రైతుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి కుటుంబాలు విడిపోవటం, భూముల విక్రయాలు, వారసత్వంగా భూముల బదిలీతో పాటు రైతుబంధు పథకం ప్రధాన కారణంగా నిలుస్తోంది. రాష్ట్రప్రభుత్వం 2018లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించి ఒక పంటకు ఎకరాకు 4 వేల చొప్పున వానాకాలం, యాసంగిల్లో ఏడాదికి రూ. 8 వేలు అందించింది. తదుపరి ఈ మొత్తాన్ని పంటకు రూ. 5 వేల చొప్పున ఏడాదికి రూ. 10 వేలకు పెంచి అమలు చేసింది. గత సర్కారు ఒక సీజన్‌లో రైతుబంధు నిధులను పూర్తిగా ఇవ్వకపోగా మరో సీజన్‌లో 5 ఎకరాల వరకే పరిమితం చేసింది. ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుబంధు పథకాన్ని రైతుభరోసాగా మార్చి భూపరిమితి విధించనున్నట్లు పేర్కొని



వ్యవసాయేతర భూముల గుర్తింపు సర్వే చేపట్టింది. ఈ ప్రభుత్వం ఒక సీజన్‌లో పూర్తిగా రైతుభరోసా నిధులను ఇవ్వకపోగా గడచిన యాసంగిలో కేవలం 4 ఎకరాల వరకే రైతుభరోసా నిధులను విడుదల చేసింది. ఈ నేపథ్యంలో అధిక భూమి ఉంటే రైతుభరోసా నిధులు రావనే ఉద్దేశంతో చాలామంది పెద్దరైతులు తమ పేరిటగల భూములను కుటుంబీకుల పేర్లమీదకు బదిలీచేస్తూ వచ్చారు. భూముల బదిలీ ఐదేళ్లుగా కొనసాగటంతో పెద్దకమతాల సంఖ్య తగ్గి చిన్నకమతాలు, రైతులసంఖ్య గణనీయంగా పెరిగింది. రైతుబంధు పథకాన్ని ప్రారంభించినపుడు జగిత్యాల జిల్లాలో రైతులసంఖ్య 1,76,194 ఉండగా ప్రస్తుతం 2,48,550కి చేరింది. ఇదివరకు 4.34 లక్షల ఎకరాల్లో సాగుభూములకు రైతుబంధు నిధులివ్వగా ప్రస్తుతం వ్యవసాయేతర అవసరాలకు పోగా గుర్తించిన 4.18 లక్షల ఎకరాలకు నిధులను అందిస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్రప్రభుత్వం ఈ సీజనుకు భూ పరిమితి లేకుండా నిధులను బదిలీ చేస్తామని పేర్కొన్నా ముమ్ముందు భూ పరిమితి ఉండవచ్చని అనుమానిస్తూ మెజారిటీ రైతులు చిన్నచిన్న భూ కమతాలకే మొగ్గుచూపుతున్నారు.

# బీడీ కార్మికులు.. అందని వైద్య సేవలు

సిరిసిల్ల : ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తరించి ఉన్న బీడీ పరిశ్రమలో పని చేసే కార్మికులకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన బీడీ కార్మికుల ఆసుపత్రులు అలంకారప్రాయంగా మారాయి. అనారోగ్యాల బారిన పడే కార్మికులకు ఆధునిక వైద్య సేవలందించాలనే లక్ష్యంతో వీటిని ఏర్పాటు చేసినా ఆశించిన మేర ఫలితాలు అందడం లేదు. కార్మికులు శ్వాసకోస, ఊపిరితిత్తులు, కీళ్ల నొప్పులు, వెన్నునొప్పి, దగ్గు వంటి సమస్యలతో బాధపడేవారికి ఇక్కడ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. వైద్య పరీక్షలు నిర్వహించే వసతులు లేవని.. సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చి సరిపెడుతున్నట్లు కార్మికులు పేర్కొంటున్నారు. సమస్యలను అధిగమించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని బీడీ కార్మికులు కోరుతున్నారు.

**13 ఏళ్లుగా అలంకార ప్రాయమే..**

తంగళ్లపల్లి మండలంలోని బద్దెనపల్లిలో 2012లో బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రిని ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అక్కడ వసతులు లేకపోవడంతో వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి శివారు శాబాష్‌పల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో పదిహేను పడకలతో ప్రారంభించినా ఏనాడు పూర్తి స్థాయిలో వైద్యం అందించిన దాఖలాలు లేవు. పాఠశాలలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహిస్తున్నారు. బడి కోసం గ్రౌండ్‌ఫ్లోర్‌లో ఓ గది, పై అంతస్తులో రెండు గదులు వినియోగిస్తుండగా ఆసుపత్రికి మూడు గదులు వినియోగిస్తున్నారు. ఒక వైద్యురాలు, నర్సుతో కొనసాగుతున్నప్పటికీ పూర్తి స్థాయి సిబ్బందిని నియమించలేదు. ఆంధ్రా, తెలంగాణ రీజియన్‌లో బీడీ కార్మిక సంక్షేమ ఆసుపత్రి కేవలం ఇదొక్కటే కావడం గమనార్హం.

**సిబ్బంది కొరత**

ముస్తాబాద్‌లో బీడీ కార్మిక సంక్షేమ నిధి స్థానిక, సంచార దవాఖానాను



పదిహేనేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఈ మండలంలో దాదాపు 15 వేలకుపైగా బీడీ కార్మికులు ఉన్నారు. ఆసుపత్రి అద్దె భవనంలో ఉదయం 9.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పనిచేస్తోంది. వైద్యాధికారి, స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం, ఫార్మాసిస్టు, వాహన డ్రైవర్, డ్రెసర్, స్వీపర్ ఉండి సేవలు అందించాలి కానీ కేవలం డ్రెసర్, ఫార్మాసిస్టు మాత్రమే ఉన్నారు. కార్మిక కుటుంబాలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వ కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా విభాగం ఏకలవ్య ప్రధాన కార్యదర్శి కుర్ర సావిత్రి తదితరులు కోరుతున్నారు.

**వసతులు కల్పించాలి**

సిరిసిల్లలోని బీడీ కార్మిక సంక్షేమ నిధి స్థానిక, సంచార దవాఖానా. గతంలో బీవై నగర్‌లో అందుబాటులో ఉండేది. ప్రస్తుతం సినారె కళామందిర్ వద్ద ఏర్పాటు చేసినా కార్మికులకు అవగాహన లేమి, ఆసుపత్రిలో వసతులు లేకపోవడం కారణంగా సేవలు అంతంతమాత్రంగానే అందుతున్నాయి. ఎప్పుడూ మూతపడే ఉంటుందని.. సిబ్బంది ఎప్పుడు వస్తారో తెలియదని స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఎల్లవేళలా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని.. మౌలిక వసతులు మెరుగుపరిచి, కార్మికులకు ఆసుపత్రి సేవలపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు.




## తెలంగాణలో 3 రోజుల పాటు వర్షాలు.. ఎల్లో హెచ్చరికలు జారీ

హైదరాబాద్: ఉపరితల ఆవర్తనం ప్రభావంతో వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఇది పశ్చిమ వాయువ్య దిశలో కదిలి ఉత్తర ఒడిశా దాని సమీపంలోని ఛత్తీస్‌గఢ్‌ల మీదుగా కదిలే అవకాశం ఉందని తెలిపింది. వాయువ్య అరేబియన్ సముద్ర తీర ప్రాంతం నుంచి ద్రోణి ఒకటి దక్షిణ గుజరాత్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ మీదుగా వాయువ్య బంగాళాఖాతంలోని అల్పపీడన ప్రాంతం వరకు సగటు సముద్ర మట్టం నుంచి 1.5 - 7.6 కి.మీ మధ్యలో ఏర్పడిందని వెల్లడించింది. అల్పపీడనం ప్రభావంతో తెలంగాణలో 3 రోజుల పాటు ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని పేర్కొంది. ఇవాళ ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. మిగతా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ శాఖ మూడు రోజుల పాటు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.




చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో మావోయిస్టులు, భద్రతా దళాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మహిళా మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల మాడ్ డివిజన్ సీనియర్ కేడర్ అబూజ్‌మడ్ అడవుల్లో ఉన్నారన్న సమాచారంతో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ (డీఆర్జీ) నారాయణపూర్, కొండగావ్ ఎస్టీఎఫ్(స్టేట్ టాస్క్ ఫోర్స్) సంయుక్తంగా ఈ ఆపరేషన్‌ను చేపట్టాయి. బుధవారం సాయంత్రం నుంచి జరుగుతున్న ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మహిళా మావోయిస్టుల మృతదేహాలను భద్రతా బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ఒక ఇన్సాస్ రైఫిల్, ఆయుధంతో పాటు వైద్య పరికరాలు, ఇతర సామగ్రిని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

## సీఎం పదవిపై జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు




హైదరాబాద్: తెలంగాణ సీఎం పదవిపై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ మూడేళ్లు రేవంత్‌రెడ్డే సీఎంగా ఉంటారని స్పష్టం చేశారు. వచ్చే ఐదేళ్లు మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి రేవంత్‌రెడ్డి ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. తొమ్మిదేళ్ల తర్వాత సీఎం కావడానికి తాను ప్రయత్నం చేస్తానని తెలిపారు. రేవంత్‌రెడ్డి సీఎంగా దిగిపోయాక తాను ముఖ్యమంత్రిని కావడానికి ప్రయత్నం చేస్తానని అన్నారు. ఆ క్రమంలో తన అప్లికేషన్ ప్రజల దగ్గర పెడుతానని చెప్పుకొచ్చారు. ఇవాళ(గురువారం) గాంధీభవన్‌లో జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడారు.

**కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్...** బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకి జగ్గారెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రతి విషయాన్ని రాద్ధాంతం చేస్తోందని మండిపడ్డారు. కవిత బీఆర్ఎస్‌లో ఉంటే ఏంటి.. బయటకు వస్తే ఏంటని ప్రశ్నించారు. ఆమె మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. తండ్రి వారసత్వం కొడుకుకే ఉంటుందని.. ఒకవేళ కొడుకు లేకపోతే కూతురికి వచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు జగ్గారెడ్డి. తాము స్పందించే అంతటి లీడర్ కవిత కాదనే తమ అభిప్రాయమని జగ్గారెడ్డి అన్నారు. కవిత పెద్ద పెద్ద మాటలు ఎందుకు మాట్లాడుతుందో అర్థం కావడం లేదని చెప్పారు. కేసీఆర్, రేవంత్‌రెడ్డి సమానమైన ప్రాధాన్యం ఉన్న నేతలని చెప్పుకొచ్చారు. రాజకీయంగా ఒకరిని మరొకరు విమర్శించుకుంటే అర్థముందని అన్నారు. కవిత ఎందుకు అనవసరంగా తమ గురించి మాట్లాడుతోందని ప్రశ్నించారు. హాయిగా బతుకమ్మ ఆడుకోకుండా కవితకి ఎందుకు ఈ పంచాయితీ అని నిలదీశారు. లిక్కర్ స్కాంలో పైసలు పెట్టడానికి కవితకి ఇన్ని వందల కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని జగ్గారెడ్డి ప్రశ్నల వర్షం కురిపించారు.

## రిజర్వేషన్లు అమలు చేసి.. ఎన్నికలు నిర్వహించాలి

హైదరాబాద్, జూన్ 26: రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు సెప్టెంబర్ 30వ తేదీ లోపు జరపాలంటూ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో బీజేపీ కార్యాలయంలో ఎంపీ ఆర్ కృష్ణయ్య విలేకర్లతో మాట్లాడుతూ.. స్థానిక ఎన్నికలు నిర్వహించడం, బీసీ రిజర్వేషన్లు పెంపుపై రాష్ట్ర ప్రభుత్వాలకే హక్కు ఉందని స్పష్టం చేశారు. సందర్భాన్ని బట్టి 50 శాతం పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తు చేశారు. వీటి పెంపులో 50 శాతం సీలింగ్‌కు అడ్డు లేదన్నారు. ఆ క్రమంలో రాజ్యాంగపరమైన అవరోధాలు సైతం లేవని తెలిపారు. త్వరగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసి.. ఎన్నికలు నిర్వహించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. అసెంబ్లీలో బీసీ బిల్లుకు అన్ని పార్టీలు ఓకే చెప్పాయని గుర్తు చేశారు. ఈ అంశాన్ని కేంద్రంపైకి నెట్టాల్సిన అవసరం అయితే లేదన్నారు. కేంద్రంపై నెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై మండిపడ్డారు. సర్పంచ్‌లతోపాటు.. అన్ని ఎన్నికలకు ఇది అప్లై అవుతాయన్నారు. తెలంగాణ జాగృతి నేత, ఎమ్మెల్సీ కవిత ఇటీవల తనను కలిసి.. కొన్ని సలహాలు అడిగిందన్నారు. ఆ క్రమంలో తాను బీసీల కోసం కొట్లాడుతున్నానని చెప్పిందని ఆయన గుర్తు చేశారు. అయితే ఈ అంశంపై కొట్లాడాల్సింది కేంద్రంతో కాదని.. రాష్ట్ర ప్రభుత్వంతో అని ఆమెకు తాను వివరించానని చెప్పారు. ప్రజా భరోసా



కార్యక్రమంలో ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం అధిక సంఖ్యలో విద్యార్థులు వచ్చారన్నారు. ఫీజు చెల్లింపు పెండింగ్‌లో ఉండడం వల్ల విద్యార్థులకు కాలేజీలు సర్టిఫికేట్లు ఇవ్వడం లేదని చెప్పారు. ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు చెల్లించక పోవడంతో క్లాసులు ఎగ్గొట్టి మరీ విద్యార్థులు ఆందోళనకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం రెండు, మూడు విడతలుగా బకాయిలు చెల్లించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి ఆయన సూచించారు.

సొంత భవనాలు లేని ప్రాంతాల్లో కొత్త భవనాలు నిర్మించాలని ప్రభుత్వానికి సూచించారు. స్టడీ సర్కిల్‌లో విద్యా ప్రమాణాలు సైతం పెంచాలని ప్రభుత్వానికి ఎంపీ కృష్ణయ్య డిమాండ్ చేశారు.




దుబాయి: ఇజ్రాయెల్- ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అనంతరం ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ తొలిసారి స్పందించారు. 12 రోజుల పాటు కొనసాగిన ఈ యుద్ధంలో ఇజ్రాయెల్‌పై తమ దేశమే విజయం సాధించిందని ఆయన ప్రకటించారు. అలాగే, అమెరికా స్థావరాలపై దాడి చేయడం ద్వారా అగ్రరాజ్యానికి గట్టి చెంపపెట్టు లాంటి సమాధానం ఇచ్చామని వ్యాఖ్యానించారు. జూన్ 19 తర్వాత తొలిసారిగా ఇరానియన్ స్టేట్ టెలివిజన్‌లో ఖమేనీ వ్యాఖ్యల వీడియో ప్రసారమైంది.

అమెరికా జోక్యం చేసుకోకపోతే ఇజ్రాయెల్ నాశనమవుతుందని అగ్రరాజ్యం భావించడం వల్లే ఈ యుద్ధంలో జోక్యం చేసుకుందన్నారు. అయితే, ఈ యుద్ధం వల్ల అమెరికా ఎటువంటి ప్రయోజనం సాధించలేకపోయిందని ఎద్దేవా చేశారు. “ఇస్లామిక్ రిపబ్లిక్ విజయం సాధించింది. అమెరికాను చెంపదెబ్బ కొట్టింది. సోమవారం ఖతార్‌లో అమెరికా కీలక స్థావరాల్లో ఒకటైన అల్ ఉదీద్ వైమానిక స్థావరంపై దాడి చేసి నష్టం కలిగించింది. ఇందులో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. ఇస్లామిక్ రిపబ్లిక్ ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా కేంద్రాలను యాక్సెస్ చేయగలదు. అవసరమనుకుంటే దాడులూ చేయగలదు. భవిష్యత్తులోనూ ఇలాంటి చర్యలు పునరావృతం కావొచ్చు. ఏదైనా దురాక్రమణ జరిగితే.. శత్రువు కచ్చితంగా భారీమూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుంది” అని ఖమేనీ హెచ్చరించారు. ఇజ్రాయెల్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చి రోజులు గడుస్తున్నా అలీ ఖమేనీ బాహ్య ప్రపంచానికి కనిపించకపోవడంతో ఆయన ఎక్కడ ఉన్నారంటూ వస్తోన్న వార్తల నేపథ్యంలో ఆయన పైవిధంగా స్పందించారు.




పహల్గాం ఉగ్రదాడి అనంతరం పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పేందుకు గాను సింధూ జలాల ఒప్పందం అమలును నిలిపివేస్తూ భారత్ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. దీంతో దాయాది దేశానికి నీటి కష్టాలు మొదలయ్యాయి. ఈ క్రమంలో పశ్చిమ నదుల నుంచి నీటిని మరింత సద్వినియోగం చేసుకునేందుకు ప్రణాళికలు రచిస్తున్న భారత్.. సుదీర్ఘకాలంగా నిలిచిపోయిన తుల్‌బుల్ నావిగేషన్ ప్రాజెక్టు పునరుద్ధరణపై దృష్టి సారించినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు చర్చలు తుది దశలో ఉన్నాయన్న విషయాన్ని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ ప్రాజెక్టు డీపీఆర్ సిద్ధమవుతోందని, ఏడాదిలో పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నాయి. అయితే, ఈ నదుల నుంచి భారత్ వాటాను మరింత సద్వినియోగం చేసుకునేందుకు అనేక ప్రతిపాదనలు పరిశీలనలో ఉన్నాయని సంబంధిత అధికారి ఒకరు పేర్కొన్నారు. పడమరవైపు ప్రవహించే నదుల్లో ఒకదాని నుంచి నీటిని పంజాబ్, హరియాణాకు మళ్లించే అవకాశం కూడా పరిశీలనలో ఉందన్నారు. సింధూ జలాల ఒప్పందం ప్రకారం.. పశ్చిమదిశగా పాకిస్థాన్ వైపు ప్రవహించే సింధూతోపాటు చీనాబ్, జీలం వంటి ప్రధాన ఉప నదులపై భారత్‌కు పరిమిత అధికారాలు మాత్రమే ఉన్నాయి. భారత్, పాక్ మధ్య 1960, సెప్టెంబరు 19న జరిగిన ఒప్పందం ప్రకారం ఈ నదీవ్యవస్థ మొత్తం నీటిలో 20% భారతదేశం, 80% పాకిస్థాన్ వినియోగించుకోవాలి. అయితే, మన దగ్గర వీటి నీటి నిల్వ సామర్థ్యం తక్కువగా ఉండటం సవాలుగా మారింది. డ్రై సీజన్‌లో కొంతమేరకు నిల్వ చేస్తున్నప్పటికీ.. వర్షాకాలంలో నిల్వ సామర్థ్యం తక్కువగా ఉంది. దీంతో అధిక నీరు వస్తే అది దిగువన పాకిస్థాన్‌కే పోతోందని సంబంధిత అధికారి పేర్కొన్నారు. అంతేకాకుండా ఒప్పందం అమలు వల్ల వరదల సమయాల్లో కొన్ని సవాళ్లు ఎదురయ్యేవన్నారు. కానీ, ప్రస్తుతం రిజర్వాయర్ నిర్వహణపై ప్రముఖంగా దృష్టి సారించామన్నారు. గతంలో పాక్ వ్యతిరేకించిన కిషన్‌గంగా ఇప్పటికే పూర్తికాగా.. రాట్లే ప్రాజెక్టు నిర్మాణం కూడా ముమ్మరంగా కొనసాగుతోందని చెప్పారు.




## 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు'.. నెక్లెస్ రోడ్‌లో ర్యాలీ

హైదరాబాద్: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నెక్లెస్ రోడ్ జలవిహార్ వద్ద 'మాదకద్రవ్యాలు వద్దు.. జీవితం ముద్దు' అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి పొన్నం ప్రభాకర్, మేయర్ గద్వాల విజయలక్ష్మి, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పలువురు అధికారులు పాల్గొన్నారు. నగరవాసలు పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొని సందడి చేశారు.

## సీఎం రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై తెలంగాణ హైకోర్టులో విచారణ



హైదరాబాద్: ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టివేయాలని కోరుతూ సీఎం రేవంత్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో.. భాజపా పరువుకు భంగం కలిగేలా రేవంత్‌రెడ్డి మాట్లాడారని వాసం వెంకటేశ్వర్లు ఫిర్యాదుతో ప్రజాప్రతినిధుల కోర్టులో క్రిమినల్ డిఫమేషన్ కేసు నమోదైంది. కింది కోర్టులో ఉన్న కేసును కొట్టివేయాలని రేవంత్‌రెడ్డి తరఫు న్యాయవాది హైకోర్టును కోరారు. బహిరంగసభలో పీసీసీ అధ్యక్షుడి హోదాలో ఆయన రాజకీయ ప్రసంగం మాత్రమే చేశారని తెలిపారు. జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే నెల 2కి వాయిదా వేసింది.




## అమ్మవారికి తొలి సారెను సమర్పించిన ఈవో శీనానాయక్ దంపతులు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయంలో గురువారం నుంచి నెల రోజులపాటు వారాహి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఈవో శీనానాయక్ దంపతులు తొలి సారెను సమర్పించారు. మేళతాళాలతో మంగళ వాయిద్యాల నడుమ అమ్మవారికి సారే సమర్పించారు. పసుపు, కుంకుమ, పువ్వులు, గాజులు, చలిమిడి, గోరింటాకు అమ్మవారికి శేష వస్త్రాలను సమర్పించారు.

**అమ్మవారికి సారె సమర్పించడం సంతోషంగా ఉంది..** ఈ సందర్భంగా ఈవో శీనానాయక్ మీడియాతో మాట్లాడారు. తమ చేతుల మీదుగా అమ్మవారికి సారె సమర్పించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారిని తమ పుట్టింటికి రమ్మని వేడుకుంటూ సారె సమర్పించామన్నారు. ఆషాఢ మాసంలో నెల రోజులపాటు అంగరంగ వైభవంగా సారే సమర్పణ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. తెలంగాణ నుంచి అమ్మవారికి ఈనెల 29వ తేదీన బంగారు బోనం సమర్పిస్తారని చెప్పుకొచ్చారు. ఈ మాసంలోనే అమ్మవారికి శాఖాంబరి ఉత్సవాలు జరుగుతాయన్నారు. జులై 8 , 9, 10 తేదీల్లో శాకంబరీ ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఈరోజు నుంచి నెల రోజులపాటు ఇంద్రకీలాద్రిపై వారాహి ఉత్సవాలు జరుగుతాయని ఈవో శీనానాయక్ వెల్లడించారు.

**నెల రోజులపాటు ఉత్సవాలు..** కాగా, ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సారెను సమర్పించడం ఆనవాయితీ. తెలుగు రాష్ట్రాలతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచీ దుర్గమ్మకు భక్తులు సారె సమర్పిస్తారు. మహామండపం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తిని ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూలవిరాట్ దర్శన అనంతరం ఉత్సవమూర్తికి సారెను సమర్పిస్తారు. కాగా, వైదిక కమిటీ సూచనల మేరకు హోమ గుండాలు, భక్తులు కూర్చునేందుకు తివాచీలు ఏర్పాటు తదితర అంశాలపై ఈవో శీనా నాయక్ ఇప్పటికే అధికారులకు పలు సూచనలు చేశారు. వారాహి అమ్మవారి నవరాత్రుల గురించి ప్రచారం చేసి విజయవంతం చేయాలని పలు విభాగాలకు ఆదేశాలిచ్చారు. వారాహి ఉత్సవాలు గురువారం (26వ తేదీ) నుంచి జులై 24వ తేదీ వరకూ నిర్వహించనున్నారు.

## సైబర్ నేరగాళ్ల ట్రాప్ నుంచి హైదరాబాద్ వ్యాపారి గ్రేట్ ఎస్కేప్!

ఎప్పటికప్పుడు సరికొత్త స్క్రిప్టుతో ఆశ పెట్టటం లేదంటే భయపెట్టటంతో మోసం చేసే సైబర్ నేరగాళ్ల విసిరిన ఉచ్చు నుంచి తెలివిగా తప్పించుకున్నారు హైదరాబాద్ కు చెందిన వ్యాపారి. ఆయనకు ఎదురైన అనుభవం మిగిలిన వారందరికి ఒక చక్కటి పాఠంగా చెప్పాలి. తీవ్రమైన ఒత్తిడి వేలలోనూ లాజిక్ మిస్ కాకుండా వ్యవహరించిన సదరు వ్యాపారి తెలివిని అభినందించాల్సిందే. అసలేం జరిగిందంటే.. సరూర్ నగర్ గ్రీన్ పార్కు కాలనీకి చెందిన వ్యాపారి శ్రీనివాసరెడ్డికి ఈ నెల 19న వాట్సాప్ లో ఒక కాల్ వచ్చింది. స్క్రీన్ మీద సీబీఐ విక్రమ్ అనే పరు కన్పించటంతో కొంత ఆందోళనకు గురయ్యారు. అంతేకాదు సదరు వాట్సాప్ కాల్ డీపీగా తెలంగాణ హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా ఫోటో ఉండటంతో టెన్షన్ కు గురయ్యారు. ఫోన్ చేసిన వారు తమను తాము కెనడా సైబర్ క్రైం విభాగం అధికారులుగా పేర్కొంటూ 7 నిమిషాల 49 సెకన్లు మాట్లాడారు. మీ అమ్మాయి కెనడాలో డ్రగ్స్ కేసులో అరెస్టు అయ్యింది. వెంటనే మేం చెప్పిన ఖాతాకు రూ.50 వేలు పంపితే ఆమెను విడుదల చేస్తామని పేర్కొన్నారు.



ఒకవేళ డబ్బులు పంపని పక్షంలో ఆమెపై థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తామని బెదిరింపులకు దిగారు. దీంతో సదరు వ్యాపారి తీవ్ర ఆందోళనకు గురయ్యారు.తమ కుమార్తెను చూపాలని కోరారు. అందుకు సైబర్ నేరగాళ్లు నో చెప్పారు. అదే సమయంలో పక్క నుంచి మరికొందరి అరుపులు.. కేకలు వినిపించాయి. డబ్బులు ఇస్తే తప్పించి మాట్లాడించమని చెప్పటంతో.. ఫోన్ కాల్ కట్ చేసిన సదరు వ్యాపారి వెంటనే కెనడాలో ఉన్న తన కుమార్తెకు ఫోన్ చేయగా.. తనకు ఏమీ కాలేదని.. తాను ఇంట్లోనే ఉన్నట్లుగా చెప్పటంతో తనను సైబర్ నేరగాళ్లు ట్రాప్ చేశారన్న విసయాన్ని అర్థం చేసుకున్నారు. ఆ వెంటనే తనకు వచ్చిన వాట్సాప్ నెంబరును పరిశీలించగా అది పాకిస్తాన్ నుంచి వచ్చినట్లుగా గుర్తించారు. వెంటనే సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే రీతిలో మిగిలిన వారు ఎవరైనా సైబర్ నేరస్తులు విసిరే ఉచ్చులో పడకుండా కాస్త ఆలోచించి నిర్ణయం తీసుకుంటే కష్టపడి సంపాదించిన డబ్బులు చేజారవు.

## యుద్ధాలతో సంబంధం లేని ప్రాంతాలు.. మూడోది వచ్చినా ఇక్కడ సేఫ్!



గత కొంతకాలంగా ప్రపంచంలో ఏదో ఒక మూల ఉద్రిక్త పరిస్థితులు నెలకొంటూనే ఉన్న సంగతి తెలిసిందే. ఉదాహరణకు సుమారు మూడేళ్లుగా అవిరామంగా సాగుతోన్న ఉక్రెయిన్ - రష్యా యుద్ధం.. 2023 అక్టోబర్ నుంచి జరుగుతున్న ఇజ్రాయెల్ %-% హమాస్ వార్.. ఈ క్రమంలో తాజాగా ముగిసినట్లు చెబుతోన్న ఇజ్రాయెల్ - ఇరాన్ మధ్య దాడులు! ఈ సమయంలో మూడో ప్రపంచయుద్ధం వస్తే..? అయినప్పటికీ ఉన్నంతలో సేఫ్ గా ఉండే ప్రాంతాల విషయం తెరపైకి వచ్చింది. అవును... ఇటీవల కాలంలో పలుదేశాల మధ్య జరుగుతున్న యుద్ధాలు, ఉద్రిక్త పరిస్థితుల వేళ మూడో ప్రపంచయుద్ధానికి సంబంధించిన చర్చలు విపరీతంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఒకవేళ నిజంగానే.. ఏ రెండు దేశాల వల్ల మూడో ప్రపంచ యుద్ధానికి తెరలేచినా.. ఆయా దేశాలకు చెందిన మిత్రదేశాలన్నీ ఈ యుద్ధంలో పాల్గొనే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. అప్పుడు అది భారీగా విస్తరించే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో... ఆయా దేశాల్లోని భౌగోళిక, రాజకీయ స్థితిగతులు.. సైనిక తటస్థత, స్థిరమైన పరిస్థితుల కారణంగా సురక్షితమైన ప్రాంతాలుగా గుర్తింపు పొందిన వాటి వివరాలను 'ది మెట్రో' తెలిపింది. అవేమిటనేది ఇప్పుడు చూద్దామ్..!

**అంటార్కిటికా:** అణు యుద్ధం జరిగితే అంటార్కిటికా అత్యంత సురక్షితమైన ప్రదేశాలలో ఒకటి కావచ్చు. ఇక్కడ యుద్ధాలు జరిగే అవకాశం చాలా తక్కువ లేదా అస్సలు లేదని అంటున్నారు. అదనంగా 5.4 మిలియన్ చదరపు మైళ్ల విస్తీర్ణంలో ఉన్న దాని విస్తారమైన భూమి ఎంతోమంది ఆశ్రయం పొందేందుకు తగినంత స్థలాన్ని అందిస్తుంది.

**ఐస్లాండ్:** ఐస్లాండ్ కూడా యుద్ధ సమయాల్లో మరొక సురక్షితమైన స్వర్గధామం కావచ్చు. అత్యంత శాంతియుత దేశాలలో ఒకటిగా చాలా ఏళ్లుగా టాప్ ప్లేస్ లో గుర్తింపు పొందిన ఈ దేశం పూర్తి స్థాయి యుద్ధంలో ఎప్పుడూ పాల్గొనలేదు. దేశ భౌగోళిక స్థానం యుద్ధాలకు తక్కువ అవకాశమిస్తుంది.

**దక్షిణాఫ్రికా:** మూడవ ప్రపంచ యుద్ధం జరిగినప్పుడు సురక్షితమైన ప్రదేశంగా మారే అవకాశం ఉన్న జాబితాలో దక్షిణాఫ్రికా కూడా ఉంది. సమృద్ధిగా ఆహార వనరులు, సారవంతమైన భూమి, మంచినీటి లభ్యతతో ఇది స్వయం సమృద్ధికి బలమైన అవకాశాలను అందిస్తుంది. అంతేకాకుండా.. దక్షిణాఫ్రికా ఆధునిక మౌలిక సదుపాయాలు కూడా కీలక పాత్ర పోషిస్తాయి.

**ఫిజీ:** మారుమూల ద్వీప దేశం అయ్యిన ఫిజి.. దాని పొరుగున ఉన్న ఆస్ట్రేలియా నుండి సుమారు 2,700 మైళ్ల దూరంలో ఉంది. సైనిక ఉనికితో, ఫిజి వ్యూహాత్మక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఇదే సమయంలో... గ్లోబల్ పీస్ ఇండెక్స్ - 2025లో కూడా టాప్ లో ఉంది. అదేవిధంగా... గొప్ప సహజ వనరులను కలిగి ఉంది.

**చిలీ:** 4,000 మైళ్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న దక్షిణ అమెరికా దేశమైన చిలీ.. మాస్కో - మాడ్రిడ్ మధ్య వ్యూహాత్మక లింక్ గా వ్యవహరించే సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఈ ప్రాంతం మానవ మనుగడకు అవసరమైన విభిన్న పంటలు, సహజ వనరులతో సమృద్ధిగా ఉంది. దక్షిణ అమెరికాలోని అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతాలలో చిలీ ఒకటిగా నిలిచింది.

**న్యూజిలాండ్:** మూడవ ప్రపంచ యుద్ధం భయం వెంటాడుతున్న సమయంలో.. ప్రజలు తప్పించుకోవడానికి వెళ్లే దేశాలలో న్యూజిలాండ్ కూడా ఒకటి కావచ్చు. గ్లోబల్ పీస్ ఇండెక్స్ లో రెండవ స్థానంలో ఉన్న ఈ దేశం.. ప్రపంచ సంఘర్షణలలో తటస్థంగా ఉండటంలో దీర్ఘకాల రికార్డును కలిగి ఉంది. ఒక నివేదిక ప్రకారం.. ఈ దేశం రాడార్ జాబితాలో లేదు!

**టువాలు:** హవాయి - ఆస్ట్రేలియా మధ్య సగం దూరంలో ఉన్న టువాలు ద్వీపంలో కేవలం 11,000 జనాభా మాత్రమే ఉంది. ఇక్కడి మౌలిక సదుపాయాలు పరిమితంగా ఉన్నప్పటికీ.. వనరులు యుద్ధ పరిస్థితులకు తావులేనివిధంగా ఉన్నాయి.

**స్విట్జర్లాండ్:** చాలా కాలంగా శాంతి, తటస్థతతో ముడిపడి ఉన్న స్విట్జర్లాండ్.. అణు సంఘర్షణను ఎదుర్కొనే అతికొద్ది దేశాలలో ఒకటిగా పరిగణించబడుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం నుండి ఏ యుద్ధాలలోనూ ఇది పాల్గొనలేదు. దీనికి.. దాని పర్వత ప్రాంతంతో పాటు, బలమైన సహజ రక్షణను కలిగి ఉంది.

**గ్రీన్ ల్యాండ్:** ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం, డెన్మార్క్ భూభాగం అయిన గ్రీన్ ల్యాండ్ లో కేవలం 56,000 జనాభా మాత్రమే ఉంటారు. దాని మారుమూల స్థానం, రాజకీయ తటస్థత కారణంగా ఇక్కడ సంఘర్షణలకు ఆస్కారం చాలా తక్కువని చెబుతారు.

**ఇండోనేషియా:** ఇది చిన్న దేశమైనప్పటికీ.. ప్రపంచ సంఘర్షణలలో ఎటువైపూ పొత్తు పెట్టుకోదనే పేరు సంపాదించుకుంది. ఈ దేశం నిరంతరం ప్రపంచ శాంతికి ప్రాధాన్యతనిస్తూ, తటస్థ విదేశాంగ విధానాన్ని అనుసరిస్తుంది. దేశ స్వతంత్ర వైఖరి, భౌగోళిక రాజకీయ స్థానం మొదలైనవి ఈ దేశాన్ని ప్రపంచ సంఘర్షణలవైపు చూసేలా చేయనివ్వవు.

## ట్రంప్ ని అలా వదిలేయకండి.. ఎవరికైనా చూపించండి!

ప్రపంచంలో ఎవరు ఏమైపోయినా.. ఎవరు ఏమనుకున్నా.. తాను అనుకున్న పని తాను చేస్తానని.. తాను చెప్పాలనుకున్నది తాను చెబుతానని.. జనాలు నవ్వుకున్నా, తిట్టుకున్నా తనకు సంబంధం లేదు అన్నట్లుగా ఉంటుంది డొనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలి అనే మాటలు ఇటీవల బలంగా వినిపిస్తున్నాయి. ఈ సమయంలో మరోసారి మోడీకి మండే మాటలు మాట్లాడారు ట్రంప్. అవును... భారత్ - పాకిస్థాన్ ల మధ్య అణుయుద్ధాన్ని తానే ఆపానని ఇప్పటికే చాలాసార్లు ప్రకటించారు అమెరికా అధ్యక్షుడు ట్రంప్. దీనిపై జీ7 సదస్సు వేదికగా పండు ఒలిచి నోట్లో పెట్టినంత స్పష్టంగా మోడీ క్లారిటీ ఇచ్చారు. అనంతరం ట్రంప్ మాట మార్చారు.. సీజ్ ఫైర్ కు ఆ ఇరు దేశాలే కారణమని సైడ్ అయిపోయారు. కట్ చేస్తే తాజాగా మరోసారి అవే




వ్యాఖ్యలు చేశారు. బుధవారం నెదర్లాండ్స్ లోని హేగ్ లో జరిగిన నాటో శిఖరాగ్ర సమావేశంలో పాల్గొన్న ట్రంప్.. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా... తాజాగా ముగిసిన ఇజ్రాయెల్ %-% ఇరాన్ మధ్య యుద్ధం.. అవిరామంగా సాగుతున్న రష్యా - ఉక్రెయిన్ మధ్య వార్ గురించి ప్రస్తావించారు. అయితే వాటన్నింటికంటే భారత్ - పాక్ యుద్ధాన్ని ఆపడం ముఖ్యమైనదని చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా... తాను వరుస ఫోన్ కాల్స్ తో యుద్ధం ముగించానని.. మీరు ఒకరితో ఒకరు పోరాడితే తాము ఎలాంటి వాణిజ్య ఒప్పందం చేసుకోమని భారత్, పాక్ దేశాలకు తేల్చిచెప్పానని అన్నారు. అనంతరం మోడీ తనకు గొప్ప స్నేహితుడని.. పాక్ జనరల్ ఆకట్టుకునే వ్యక్తి అని చెప్పిన ట్రంప్.. వారు కూడా వాణిజ్య ఒప్పందమే కావాలని చెప్పారని పేర్కొన్నారు. ఆ విధంగా భారత్ %-% పాక్ ల మధ్య అణుయుద్ధాన్ని తాము ఆపామని డొనాల్డ్ ట్రంప్ నాటో శిఖరాగ్ర సమావేశం అనంతరం వ్యాఖ్యానించారు. దీంతో... ట్రంప్ వ్యవహారశైలిపై నెట్టింట సెటైర్లు పడుతున్నాయి. ఇందులో భాగంగా... ట్రంప్ ని అలా వదిలేయకండి.. ఎవరికైనా చూపించండి అంటూ కామెంట్లు పెడుతున్నారు నెటిజన్లు. దీంతో... ఈ వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా పరిగణిస్తోంది.

ఈ నేపథ్యంలో కేంద్రంపై విమర్శలు చేసింది. ఈ సందర్భంగా... ట్రంప్ మాట్లాడిన వీడియోను 'ఎక్స్'లో పోస్టు చేసిన కాంగ్రెస్ సీనియర్ నేత జై రాం రమేశ్.. మే 10 నుంచి ట్రంప్ ఇలా చెప్పడం 18వసారి అని అసహనం వ్యక్తంచేశారు. ట్రంప్ ఒత్తిడికి లొంగిపోయి ప్రధాని భారత ప్రయోజనాలను తుంగలోతొక్కారని ఆ పార్టీ నేత పవన్ ఖేరా వ్యాఖ్యానించారు.

### సినిమా 'షో'

## బుట్టబొమ్మని గట్టెక్కించేది ఆ ఇద్దరేనా?

ఫిల్మ్ ఇండస్ట్రీలో కొంత మంది క్రేజ్ ఎంత రాకెట్ స్పీడుతో పెరుగుతుందో అంతే స్పీడుగా పడిపోతుంటుంది. ఇలియానా, శ్రీలీల ఇప్పుడు బుట్టబొమ్మ పూజా హెగ్డే. ఈ ముగ్గురు టాలీవుడ్‌లో ఎంత స్పీడుగా ఎదిగారో అంతే స్పీడుగా ఫ్లాపుల్ని ఎదుర్కొన్నారు. ఇప్పటికీ ఎదుర్కొంటున్నారు. దానికి కారణం వారు ఎంచుకున్న సినిమాలే. ఇలియాన రాకెట్ స్పీడుతో ఎదిగి అంతే స్పీడ్‌తో తెరమరుగైపోయింది. ఇప్పుడు ఆ పరిస్థితిని బుట్టబొమ్మ పూజాహెగ్డే ఎదుర్కొంటోంది. డీజే దువ్వాడ జగన్నాథంమూవీతో బిగ్ డైరెక్టర్ల దృష్టిని ఆకర్షించిన పూజా హెగ్డే అనతికాలంలోనే వరుసగా క్రేజీ ఆఫర్లని దక్కించుకుని టాక్ ఆఫ్ ది టాలీవుడ్‌గా నిలిచింది. బన్నీ అలవైకుంఠపురం%-% వరకు అదే హవాని కొనసాగిస్తూ భారీగా డిమాండ్ చేసిన పూజా హెగ్డే ఆ తరువాత నుంచి వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొంటూ కెరీర్ పరంగా ఎదురీదుతోంది. రాధేశ్యామ్, బీస్ట్, ఆచార్య, బాలీవుడ్‌లో సర్కస్, కిసీకి భాయ్ కిసీకి జాన్, దేవ వంటి సినిమాలతో వరుస ఫ్లాపుల్ని ఎదుర్కొని షాక్



ఇచ్చింది. ఈ సినిమాలతో పూజా హెగ్డే వరుసగా రికార్డు స్థాయిలో 7 ఫ్లాపుల్ని దక్కించుకోవడం గమనార్హం. తాజాగా సూర్య, కార్తీక్ సుబ్బరాజ్‌ల రెట్రోతోనూ ఫ్లాప్‌ని ఎదుర్కోవడంతో బుట్టబొమ్మ కెరీర్ ఇక అంతేనా అనే అనుమానాలు మొదలయ్యాయి. తాజా పరిణామాల నేపథ్యంలో పూజా హెగ్డేకు టాలీవుడ్, కోలీవుడ్, బాలీవుడ్‌లలో అవకాశాలు తగ్గే అవకాశం ఉందనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే తనని, తన కెరీర్ ని కాపాడేది ఆ ఇద్దరే అనే చర్చ మొదలైంది. ఆ ఇద్దరు దళపతి విజయ్, రాఘవ లారెన్స్. విజయ్ తన చివరి సినిమా జన నాయగన్ చేస్తున్న విషయం తెలిసిందే. హెచ్.వినోద్ డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమాలో విజయ్‌కి జోడీగా బుట్టబొమ్మ నటిస్తోంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందుతున్న ఈ మూవీని వచ్చే ఏడాది జనవరి 9న రిలీజ్ చేయబోతున్నారు. ఈ సినిమా ఫలితంపైనే పూజా హెగ్డే కెరీర్ ఆధారపడి ఉంది.

ఇక ఈ మూవీ తరువాత పూజా హెగ్డే హారర్ థ్రిల్లర్ కాంచన 4లో నటిస్తోంది. కాంచన ఫ్రాంచైజీలో భాగంగా రాఠవ లారెన్స్ రూపొందిస్తున్న ఈ మూవీ కూడా పూజా హెగ్డేకు కీలకంగా మారింది. తొలి సారి తను చేస్తున్న హారర్ థ్రిల్లర్ కావడం, కాంచన సీక్వెల్ కావడంతో అందరి దృష్టి ఈ ప్రాజెక్ట్‌పై పడింది. బుట్టబొమ్మకు ఈ రెండు సినిమాలు హిట్ ని అందిస్తే మరిన్ని సినిమాలు వచ్చే అవకాశం ఉంది. లేదంటే ఇక కెరీర్ ముగిసినట్టే అని ఇన్ సైడ్ టాక్.

## వార్ 2 ముందున్న సవాళ్ళు.. అంత ఈజీ కాదు..



ఇండియన్ యాక్షన్ యూనివర్స్‌లో మరో క్రేజీ ప్రాజెక్ట్ 'వార్ 2'. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్‌ల కాంబినేషన్‌కు ఇదే తొలి సినిమా కావడం, బాలీవుడ్ టాలీవుడ్ స్టార్ హీరోలు స్క్రీన్ షేర్ చేసుకోవడం వంటి అంశాలు భారీ ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. కానీ రిలీజ్ డేట్ దగ్గర పడుతున్నా ఇప్పటిదాకా ప్రమోషన్లు మొదలవ్వకపోవడంతో ఫ్యాన్స్ లో కొంత అసంతృప్తి అయితే ఉంది. ఇదే విషయమే ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చగా మారింది. హృతిక్ గాయం కారణంగా తీసుకున్న విరామం ఈ సినిమాకు పెద్దగా అడ్డంకిగా మారింది. తారక్, హృతిక్ కాంబినేషన్‌లో చిత్రీకరించాల్సిన పాటలు ఇంకా మిగిలివుండడంతో మొత్తం షూటింగ్ ఇంకా పూర్తవ్వలేదు. టీజర్ అప్డేట్ విషయం పక్కన పెడితే.. అసలు ఫస్ట్ లుక్ పోస్టర్ అయినా వదిలుంటే ఓ లెవెల్ బజ్ వచ్చేది. కానీ డెడ్ లైన్ దగ్గరపడుతున్నా ఈ విషయంలో యష్ రాజ్ ఫిలింస్ అలసత్వం చూపుతోంది. ప్రేక్షకులు, డిస్ట్రిబ్యూటర్లు ఇద్దరూ కలిపి ఎదురు చూస్తున్న సమయంలో ఎలాంటి అప్డేట్ రివీల్ చేయకపోవడం వింతగా మారుతోంది. ఇదిలా ఉండగా, వార్ 2 తెలుగు, తమిళ వర్షన్ హక్కులకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. పలు టాప్ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఇప్పటికే భారీ బిడ్లు వేస్తున్నాయని సమాచారం. అయితే యష్ రాజ్ బేనర్ మాత్రం ఇప్పట్లో డీల్స్ క్లోస్ చేయడం లేదట. సరిగ్గా టీజర్ రిలీజ్ టైమ్ దగ్గరే రెస్పాన్స్ బేస్డ్ వ్యూహంతో ముందుకెళ్లాలని చూస్తున్నారు. ఇది పాజిటివ్ స్ట్రాటజీ అయినప్పటికీ, ప్రస్తుతం పోటీ బాగా పెరిగిపోవడం వల్ల మరింత ఒత్తిడి పడుతోంది. అదే సమయంలో రజనీకాంత్ 'కూలి' పోస్ట్ ప్రొడక్షన్ ఫుల్ స్పీడ్‌లో జరుగుతోంది. షూటింగ్ ఎప్పుడో పూర్తయింది, టీజర్ బ్లాస్ట్ చేసింది. రిలీజ్ డేట్ కన్‌ఫర్మ్ అయింది. ఇది వార్ 2 టీంకు ఎదురులేని మెసేజ్‌లాంటిది. రెడీ కావడంలో కూలి ముందుండటం నిజంగానే ఆందోళనకరం.. వార్ 2 రిలీజ్ డేట్ మాత్రం మార్చే ప్రసక్తే లేదని డిస్ట్రిబ్యూషన్ వర్గాలు చెబుతున్నాయి. జూన్ చివరినుండి ప్రమోషన్ కార్యక్రమాలు స్టార్ట్ చేయాలని యష్ రాజ్ ప్రణాళిక వేసింది. రాజమౌళి తరహాలో దేశం చుట్టే ప్రమోషన్లు జరపాలని చూస్తున్నారు. ప్రత్యేకంగా తారక్‌కు కూడా బ్రేక్ ఇచ్చి ఆ ప్రచారాల్లో భాగం అయ్యేలా ప్లాన్ ఉంది. ఐతే ఓ విషయం క్లియర్.. ఈ సినిమాలో బహుశా ఎలాంటి స్పెషల్ క్యామియోలు ఉండబోవు. మొదటి నుంచే దాగుడుమూతల మధ్య సాగిన ప్రచారానికి ఈ క్లారిటీ కొంతవరకు నిరాశ కలిగించే అంశం కావచ్చు. మొత్తానికి క్రేజ్ ఉన్నా.. కంటెంట్ గురించి క్లారిటీ లేకపోవడం, ప్రమోషన్ ఆలస్యం, బిజినెస్ డీల్స్ మళ్లింపులు అన్నీ కలిపి వార్ 2 యూనిట్‌ను గట్టిగా పరీక్షిస్తున్నాయి. మరి ఈ చాలెంజ్ లను ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

## ఎట్టకేలకు ఫరియా ఫిక్స్ చేసిందా?

జాతి రత్నాలు సినిమాతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చిన ఫరియా అబ్దుల్లా ఆ సినిమాతో మంచి హిట్ ను అందుకుంది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించి నటిగా మంచి పేరు తెచ్చుకున్న ఫరియా అబ్దుల్లా ఆఖరిగా మత్తు వదలరా2 లో కనిపించింది. ఆ సినిమా బ్లాక్ బస్టర్ అయినప్పటికీ ఆ తర్వాత ఫరియా నుంచి మరో సినిమా వచ్చింది లేదు. అయితే తాజాగా ఇప్పుడు ఫరియా ఇన్‌స్టాగ్రమ్ లో చేసిన ఓ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతుంది. ఫరియా ఓ ప్రొడక్షన్ హౌస్ నుంచి వచ్చిన ఓ టీజర్ ను తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. ది టైటిల్ ఈజ్ హిజ్ నేమ్, అతని ఆటకు రెడీ గా ఉండు. మ్యాడ్‌నెస్ స్టార్ట్ కానుందంటూ ఆ పోస్టర్ కింద రాసి ఉంది. %వీజీవీ% మోషన్ పిక్చర్స్, బురా, సద్ది క్రియేటివ్ ఆర్ట్స్ బ్యానర్లు ఆ సినిమాను సంయుక్తంగా రూపొందిస్తున్నాయి. అమర్ బురా, జయకాంత్, వేణు సిద్ది ఈ



సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో ఫరియా నటిస్తున్నానని డైరెక్ట్ గా చెప్పకపోయినప్పటికీ ఆ టీజర్ ను ఆమె షేర్ చేయడం వెనుక ఉద్దేశం అదే అని ఆమె ఫ్యాన్స్ అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి సంవత్సరం తర్వాత ఫరియా సినిమా ఓకే చేసిందని, ఈ ప్రాజెక్టుతోనే ఫరియా మళ్లీ స్క్రీన్ పైకి రానుందని వారు భావిస్తున్నారు. ఫరియా షేర్ చేసిన ఆ టీజర్ డార్క్ కామెడీ మూవీ అని తెలుస్తోంది. ఫరియా పోస్ట్ ఆమె కంబ్యాక్ ను సూచిస్తే, తెలుగు మూవీ కొత్త పుంతలు తొక్కుతున్న ఈ టైమ్ లో ఆమె కూడా ఒక అధ్యాయంలోకి అడుగుపెట్టినట్టే అవుతుంది. మరి ఈ సినిమా అయినా ఫరియాకు మంచి హిట్ ను అందించి, తనను బిజీ ఆర్టిస్టుగా మారుస్తుందేమో చూడాలి.

Name of Premises : Venus Enclave, Block - 0, Quthbullapur City, Medchal Malkajgiri District - 500055, email : sanjeevreddyetlapuram@gmail.com. Cell : 8985829417